# అమ్మా, ఆకలేస్తోందే!

సినిమా చూడడంలో జీవాత్మను లీనంచేసి ఆ కాస్సేపూ ఆకలి దప్పులు మరచిపోయానేమోగాని ఇవతల పడ్డాకే ఆత్మారాముడు అసలు అల్లరి ప్రారంభించాడు. ఆరోజు ఆఫీసులో పని అయ్యేసరికి తొమ్మిది దాటిపోయింది. ఇంత కాఫీ తెప్పించుకుని తాగి, వో సిగరెట్‌తీసి వెలిగిస్తూంటే సెకండ్‌షో ఫస్ట్‌బెల్ వినిపించింది. ఆ ఆహ్వానాన్ని తిరస్కరించలేక హాజరయి తిరిగి వస్తున్నాను. అంత అర్థరాత్రివేళ ఏం దొరుకుతాయని! అబ్దుల్లా హోటల్లో కేకులు తిని టీ ఆరగించానుగాని కొండనాలికకి కబురందినట్లులేదు.

రూంతాళం తీసుకుని లోపలికి రాగానే నన్ను ఆహ్వానించింది పనిమనిషి పెట్టి వెళ్ళిన కూజాడు నీళ్ళు. అలా ఎత్తిపెట్టుకుని గటగట తాగేస్తూంటే అమ్మమాట జ్ఞాపకం వచ్చి అలాగే ఉండిపోయాను— 'ముందే అన్ని మంచినీళ్ళు తాగేస్తే అన్నమేం తింటావు బాబూ?'

ఇప్పుడలా అనిపిస్తోంది గాని అమ్మ బతికున్నన్నాళ్ళూ ఆవిణ్ణి అల్లరిపెట్టని రోజులేదు. చిన్నప్పుడు బడినుంచి ఇంటికి రాగానే చిరుతిళ్ళ కోసం నా ముక్కూ కళ్ళూ మూల మూలల గాలించేవి. అన్నం విస్తరితో పాటు ఫలహారాలపళ్ళెం లంచంగా పక్కనుంటేగాని భోజనానికి రానని మారాం చేసేవాణ్ణి. 'కడుపునిండా ఇంత అన్నం తినరా బాబూ!' అని ఏరోజుకారోజు బతిమాల వలసిందే. 'అబ్బ, ఉండవే, చంపేస్తున్నావు!' అని విసుక్కునేవాణ్ణి. ఇక సాయంకాలం ఒళ్ళు అలసిపోయేలా ఆడివస్తే ఎన్ని మంచినీళ్ళు తాగినా ఇంకా తాగాలనే ఉండేది. ఇక కాస్త పెద్దవాడినై కాలేజీలో స్టూడెంట్‌గిరీ వెలిగించే రోజుల్లో వో రాత్రయినా సరిగ్గా భోజనాల వేళకి ఇంటికొచ్చానా! అప్పుడే ఆరంభమయింది నాకీ సెకండ్‌షోల పిచ్చి.

మా నాన్నగారికి సాయంకాలం ఆరూ ఆరున్నరకి మస్తుగా టిఫిన్‌తిని కాఫీ తాగి ఊరిమీద బలదూరు తిరగడం అలవాటు. మళ్ళీ తొమ్మిదిన్నరకే రాత్రి భోజనం చేసేవారు. ఆ అలవాటే మాకూ అయింది. ఇంటికొచ్చి భోంచేసి మరీ సినిమాకి వెళ్ళమని బతిమాలేది అమ్మ. పోనీ అలాగే చేద్దాంలే అనుకునేవాణ్ణి. కాని ఫ్రెండ్సుతో కబుర్లలో పడి సినిమాకి వెడితే ఆట అయిపోయిన తర్వాతగాని ఇల్లు గుర్తుకు వచ్చేదికాదు.

ఇక ఆ అపరాత్రివేళ, పిల్లిలా ఇల్లు చేరుకునేవేళ, అమ్మ పడుకుంటుందేమో అని బాధ, నాన్న మేలుకుని ఉంటారేమో అని బాధ! ఈ నాన్నాజీలకి వేడి వేడిగా వడ్డించటమేగాని, తియ్య తియ్యగా తినిపించడం తెలీదుగదా! చిత్రం ఏమిటంటే 'అమ్మా అన్నం పెట్టవూ?' అని ఏ ఒక్కనాడూ నేను అడక్కుండానే అమ్మ అమర్చిపెట్టేది. నాకేం కావాలో నాకంటె అమ్మకే ఎక్కువ తెలుసేమో అనిపించేది. చందమామను చూపించి, మంచి మాటలాడి, తినిపించినా, బూచిపేరు చెప్పి బెదిరించి ఇంకా వినకపోతే దెబ్బ పైకిపోకుండా పిర్రమీదా బుర్రమీదా ఎగాదిగా వాయించి, బలవంతాన కూరినా పిల్లలు గన్న చల్లని తల్లికే చెల్లింది. ఏ విధాన్నైనా అయితేనేం అబ్బాయి కడుపు నిండడమే అమ్మకి కావలసింది. అమ్మ అనే ధన్యజీవికి ఈ లోకంలో ఉండడం, లేకపోవడంతో సంబంధం లేదు. అబ్బాయికి ఆకలి వేసినప్పుడల్లా అమ్మ జ్ఞాపకం వస్తూనే ఉంటుంది.

కాని, ఆ అర్ధరాత్రి ఆకలివేళ కేవలం ఆలోచనతో తృప్తిపడడం నాకు చేతకాలేదు. కంచం నిండా మజ్జిగన్నం కలిపితెచ్చి కొసరి కొసరి తినిపించే అమ్మ లేకపోయిందనే ఆలోచనతో నా కన్నీళ్ళు ఆగలేదు.

కళ్ళెత్తి పక్కకు తిరిగి చూసేసరికి టేబిల్‌మీద ఫోటోఫ్రేమ్‌లో సరోజ, పరిహసిస్తూ నన్ను పలకరించినట్టు అనిపించింది.

'అమ్మ'లు ఆచంద్రార్కం ఉండిపోతారా అబ్బాయిగారూ? అమ్మాయిలు వచ్చి అనతికాలంలో అమ్మల ఛార్జీ తీసుకోరూ? కంగారుపడక కాస్త వోపిక పట్టండి. కాబోయే కాంతారత్నాన్ని, కావలసింది చేసి పెట్టడానికి నేను లేనూ?'

తడిసిన నా కళ్ళల్లో రంగు రంగు దృశ్యాలు కనిపించాయి.

ఇద్దరం బాగా చదువుకున్నాం. ఉద్యోగాలుచేసి మొయ్యాగడించు

కుంటాం. పగటిపూట మాకు తీరిక ఉండదు. ఉండకపోతేనేం లోకమంతా ఏకమై పగలంతా పడుచువారికి ఊపిరి తిరగకుండా పని కల్పించుగాక. పగలంతా ప్రతీక్షణం రాత్రికోసం ఎదురుచూడగలం. సాయంకాలం జీవుడు ఇల్లు చేరుకున్నాక ఏంచేస్తాం? తలారా ఒక్కస్నానం చేసేసరికి, శరీరానికి పట్టిన చెమటతోపాటు. మనసుకి పట్టిన అలసటకూడా కడిగేసుకుంటాం. కమ్మ కమ్మగా గరంగరంగా, కడుపు విరిగేలా టిఫిన్లు వాయిస్తాం. కన్ను చెదిరేలా గంటలతరబడి ముస్తాబు అవుతాం. ఒక్కొక్కరం ఇరవై పైసల స్పెషల్ కిళ్ళీలు మూడేసిచొప్పున ఒక్కసారే నోటబిగించి సినిమా రోడ్డున పడతాం. ఈ ట్యూబులైట్లు మావి, ఈ సిమెంటురోడ్లు మావి, ఈ పచ్చని పార్కులు మావి, ఈ రకరకాల రంగురంగుల రాత్రి, ప్రకటనలు మావి, ఈ ఎయిర్‌కండిషన్ సినిమాథియేటర్లు మావి. ఈ నవనాగరిక ప్రపంచంలో మాలాంటివారివి కానివి మరేముంటాయి!

సెకండ్‌షో సినిమానుంచి తిరిగి ఇంటికి చేరుకునేసరికి మాంచి వయసులో ఉన్నామేమో, మళ్ళీ నకనకలాడుతూ ఉంటుంది కడుపులో. ఆ రోజుల్లో అర్ధరాత్రివేళ నేను పేరుకున్న నెయ్యి వేసుకోలేనని అమ్మ బొగ్గులకుంపటి వెలిగించి నెయ్యి వెచ్చబెట్టేసరికి అరగంట దాటేది. ఏ ఆధునిక పరికరమూ లేకుండానే, ఏమీ చదువుకోని అమ్మలాంటిదే అమృతంలా చేసేదే. అన్నీ అమర్చుకున్న ఇంట్లో, అంత పెద్ద చదువు చదువుకున్న సరోజలాంటి తెలివైన అమ్మాయికి రానివంటకం అంటూ ఉంటుందా! నేనిలా బట్టలు మార్చుకు వస్తానో లేదో – దూరంనుంచి చూస్తేనే నోరు ఊరిపోయేలా డైనింగ్ టేబిలు నింపెయ్యదూ! ఇక ఆ ఒంటిగంట రాత్రి వేళ, ఎదురెదురుగా కూచుని, కబుర్లు చెప్పుకుంటూ, గల గల నవ్వుకుంటూ, కర కర ఏ అప్పడమో నవులుకుంటూ, తీరికగా హాయిగా .... నెమ్మదిగా, నిశ్చింతగా .... నిదానంగా, సరదాగా....

ఇక ఆ ఒంటిగంట రాత్రివేళ మొదలెట్టిన ఆ భోజన కార్యక్రమం పూర్తి అవడమంటూ లేదా ఏమిటి? అని ఎవరైనా విసుక్కోడం అనవసరం. ఇంతకీ భోజనంతోనే ఆరోజు కార్యక్రమం పూర్తిచెయ్యమనడం అతి దారుణం. ఇక తెల్లారి తొమ్మిది గంటలలోగా మమ్మల్నెవరైనా లేపడానికి సాహసించారో మెషిన్‌గన్‌తో పేల్చెయ్యడానికైనా వెనుకాడం.

అందమైన ఆలోచనలతో కునుకు కరువైపోయి లేచి కూర్చున్నాను. దిక్కుమాలిన ఈ ఆరు నెలలూ ఎప్పటికి గడుస్తాయో!

'నీ పెళ్ళి నడకలు మండిపోనూ, కాస్త గబగబా తిరుగుమా, గడియారమా!' అని వాల్ క్లాక్‌ని మందలించబోయాను. 'నెల నెలా మీకు మాసికం పెట్టే సంగతి మేం ఎరుగుదుం గాని, కేలండరుగారూ, మరింత త్వరగా ఆత్మహత్య చేసుకుందురూ!' అని వారినీ బ్రతిమాలి చూశాను. ఊహుఁ ఎవరూ చెక్కుచెదరలేదు. మాయదారి కాలపురుషుడు అడుగుదీసి అడుగు వెయ్యడం మానుకున్నట్లున్నాడు!

ఇక సరోజని చూడకుండా ఉండడం నాతరం కాదనిపించింది. ఈ ఏడాది పూర్తయ్యాక మూఢమి వెళ్ళేక, ముహూర్తాలు కుదిరేక మానాన్న. వాళ్ళ నాన్నా ఏక మాటకి వచ్చేక....ఎక్కడ చెయ్యాలో నిశ్చయించుకున్నాక .... ఎవరెవర్ని పిలవాలో అనుకున్నాక .... ఏ రకంగా శుభలేఖలు వెయ్యాలో నిర్ణయించుకున్నాక .... దిక్కుమాలిన తతంగాలు. అవన్నీ కట్టగట్టి మంటబెట్టి బూడిదచేసి ఆ బూడిదను పడుచువాళ్ళంతా కలసి ఆకాశంమీంచి సముద్రంలోకి జల్లే రోజు ఎప్పుడొస్తుందో!

ఇప్పటికి రెండేళ్ళు దాటింది, సరోజని కలుసుకుని. అసలు ఈ రెండేళ్ళూ మనిషిని చూడకుండా కేవలం ఊహలతో ఉత్తరాలతో ఎలా గడపగలిగేనో! ఇంకా ఎన్నెన్ని కొత్త కొత్త అందాలతో వెలిగిపోతోందో! ఇంత దగ్గరగా వచ్చేక వోమారు వెళ్ళి చూసి రాకపోవడం కేవలం మూర్ఖత్వం. ముందురోజే కబురు తెలిసింది. సరోజ ధాన్యం అమ్మించి డబ్బు పట్టుకెళ్ళడానికి వాళ్ళ స్వగ్రామం అనకాపల్లివస్తోందని. ఆ ఊళ్ళోనే వాళ్ళ తల్లి తండ్రి ఇల్లుంది. ఆ మధ్య ఏదో ఆఫీసుకి అద్దెకిచ్చారు గాని ఇప్పుడది ఖాళీగానే ఉంది. సరోజ అక్కడే దిగుతుంది. ఆమెకేం లోపం? చిన్నప్పట్నుంచీ వాళ్ళింటిని కనిపెట్టుకుని ఉన్న రాజమ్మ అనే వంట మనిషి ఆమెను క్షణం వదలక, కంటికి రెప్పలా కాపాడుతూ ఉంటుంది. అందుకే హైదరాబాదులో మెడిసిన్ చదువుతున్నా సరోజకి హాస్టలులో ఉండవలసిన అవసరం లేకపోయింది. చిక్కడపల్లిలో నూర్రూపాయలకి రెండు గదులు అద్దెకు తీసుకుని, రాజమ్మను పెట్టుకుని రాణిలా వెలిగిస్తోంది. నే నంతదూరం హైదరాబాదు ఎలాగా వెళ్ళలేను. ఇంత దగ్గిరగా

అనకాపల్లి వచ్చినప్పుడయినా చూడకుండా ఉండగలనా? మధురమైన ఆలో చనల మగతలో ఎప్పుడో నిద్ర పట్టేసింది.

ఆ మర్నాడు గుడ్‌ఫ్రైడే. ఆఫీసుకు శలవు. శనివారం శలవు పెడితే మూడ్రోజులు కలిసి వస్తుంది. శలవు చీటీ పంపించి ఎక్స్‌ప్రెస్ అందుకున్నాను. తీరా ఆ ఊరు చేరుకున్నాకగాని ఎక్కడ దిగాలో ఆలో చించలేదు. బాగా దూరపు వరస అయినా పనిగట్టుకు పరిశీలిస్తే సరోజ వరసకి నాకు మరదలని తేలుతుంది. మరి వాళ్ళ తాతగారు మా తాతగారు కాకపోతారా? సరాసరి ఆ ఇంటికే వెళ్ళొచ్చు. మా అమ్మ ఉన్నప్పుడు ఆవిడతోపాటు ఎన్నోసార్లు వెళ్ళేనుకూడా. కాని ఎంత కాదనుకున్నా ఇప్పుడు నా హోదా పెళ్ళికొడుకు హోదాకదా! అక్కడికే వెళ్ళడం అంతగా మనస్కరించలేదు. ఏదైనా మంచి హోటల్లో దిగుదాం అని వెదుకుతూంటే—నాతో చిన్నప్పుడు గంగారామయ్య మేష్టారిదగ్గిర ప్రైవేటు పెట్టించుకొన్న సుధాకరం కనిపించాడు. నేను మొదట్లో పోల్చనే లేదు. అక్కడి కాలేజీలో ఫిజిక్స్ డిమాన్‌స్ట్రేటరుగా ఉంటున్నాట్ట. గబ గబ అన్నీ చెప్పి, నా చేతిలోంచి సూట్‌కేస్ లాక్కుని, సైకిల్‌రిక్షా మాట్లాడి వాళ్ళింటికి ఈడ్చుకుపోయాడు. పెళ్ళాం పురిటికి వెళ్ళిందట. తల్లి వుంది. ఏవో చిన్న చదువులు చదువుతున్న వో చెల్లెలూ, తమ్ముడూ కూడా ఉన్నారు. ఆ తల్లి ఆదరణా అభిమానమూ చూస్తూ ఉంటే మళ్ళీ మా అమ్మ గుర్తుకొచ్చింది.

ఆ రోజు వాళ్ళ కాలేజీకి కూడా శలవే అయినా ఏవో ప్రాక్టికల్ క్లాసులున్నాయట సుధాకరం వెడుతూ నన్నూ రమ్మని కూచున్నాడు. కాలేజీ అంతా తిప్పి చూపించాడు. ప్యూన్‌చేత కాఫీ టిఫినూ తెప్పించాడు. నేనే ఏమైనా మారానేమోగాని ఆ రోజు వాడూ నేనూ కలిసి లాంతరు పట్టుకుని ట్యూషన్‌కి వెళ్తోంటే దార్లో కబుర్లు చెప్పినంత ఫ్రీగా ఇప్పుడూ చెబుతున్నాడు. ఎంతో సరదా వేసింది. వాడిని అడగకూడనిది లేదనీ, చెప్పకూడనిది లేదనీ అనిపించింది.

'నేనిందాక నీతో చెప్పేనే ఏదో ఆఫీసు పనిమీద ఈ ఊరు వచ్చానని, అది అబద్ధంరా!' అన్నాను తలవంచుకుని.

'నే నిందాక సీతో చెప్పేనే పెళ్ళాన్ని పురిటికి పంపించానని, అదీ అబద్ధమేరా!' అన్నాడు నవ్వుతూ.

ఇంటికొస్తున్నప్పుడు దారిలో అన్ని సంగతులూ చెప్పేడు. తనతో దెబ్బలాడి పెళ్ళాం పుట్టింటికి వెళ్ళిందిట. తనవాళ్ళ నెవర్నీ దగ్గర ఉంచుకోవడం సీతారత్నానికి ససేమిరా కిట్టదట.

'అమ్మ పేర నాన్నగారు డిపాజిట్ చేసిన పదిహేనువేలకి వడ్డీ వస్తుంది. పిల్లలిద్దరి పేరా చెరో ఇల్లూ....అద్దెలు వస్తాయి. వాళ్ళకి నేనేం కానీ పెట్టక్కర్లేదు, వేరే పెడితే లోకం ఏమనుకుంటుంది!' అంటాడు అతను.

'వాళ్ళను మనం దగ్గరుంచుకుంటే వాళ్ళ డబ్బు మనం తినేశామని లోకం అనుకుంటుంది, అందుకనే వాళ్ళ మానాన్ని వాళ్ళని బతకనిద్దురూ!' అంటుందిట అతని భార్యామణి.

'పైకి అలా అంటుందిగాని సీత కడుపులో ఆలోచన వేరు. మా అమ్మ తిన్నంత తిని, పారబోసినంత పారబోసి, పదిమందికి పెట్టే రకంరా. మా ఆవిడది స్వతహా బాగా జాగ్రత్తగా, పదిమాట్లు ఆలోచించి ఖర్చుపెట్టేరకం. మాటవరసకి 'అయిదుగురు మనుషులకి ఈ నీళ్ళపాలు రెండుశేర్లు ఏం చాలుతాయి!' అంటుంది మా అమ్మ. 'ఉన్నవాళ్ళం చూస్తే మళ్ళీ అయిదుగురం. పాలకే డెభ్భైరూపాయలు అయిపోతే—ఏం పెద్ద జీతాల వాళ్ళమని. నెల పొడుగునా ఈడ్చుకు రావడానికి?' అని విసుక్కుంటుంది సీత. ఇంట్లో దెబ్బలాట జరగనిరోజు లేదనుకో'.

అని పూర్తిచేశాడు సుధాకరం.

'అయితే ఏం చెయ్యదలచుకున్నావు నువ్వు?'

'ఇదివరకు ఏమీ తోచేదికాదు. ఈసారి సీత వెళ్ళిపోయిం దగ్గర్నుంచీ తీవ్రంగా ఆలోచిస్తున్నాను. ఇంచుమించు వో నిర్ణయానికి వచ్చినట్టే.'

"ఏమిటది?"

"ఏంలేదు. పిల్లల చదువులు ఇక్కడ బాగులేవని వంకపెట్టి మా వాళ్ళ కుటుంబాన్ని విశాఖపట్నం ఎత్తేస్తాను. నాకు వీలయినప్పుడల్లా చూసి వస్తూంటాను. అన్నిటికన్న ముఖ్యం సీత ఈ రకంగా వాళ్ళ వాళ్ళ ఇంటి

కెళ్ళి రావడం నాకిష్టంలేదు. వాళ్ళు బాగా నూరిపోసి మరింత మనసు విరిచేస్తున్నారు. అమ్మా, తమ్ముడూ, చెల్లెలు వీళ్ళు నాకు ముఖ్యమే. అలా గని సీతను మరింతగా పైదాన్ని చేసుకోలేనుగద!" సుధాకరం సమస్యా, వాడు దాన్ని ధైర్యంగా ఎదుర్కొని పరిష్కరించాలని సిద్ధంచేసుకున్న పద్ధతీ – నాకు వాణ్ణి మరింత దగ్గరగా చేశాయి.

'ఒక్కొక్కళ్ళ ఇంట్లో పెంపకాన్నిబట్టీ, ఆర్థికపరమైన ఇబ్బం దుల్ని బట్టీ ఆడవాళ్ళ మనస్తత్వాలు అలా తయారవుతూ ఉంటాయి. తొందరపడి వాళ్ళనే తప్పుబట్టటం న్యాయంకాదు' అన్నాను వాడి కేదో హితవు కలిగించాలని. కాని వాడికవి అహితవుగా ఉన్నాయని ముడుచుకు పోయిన వాడి మొహమే చెబుతోంది.

'అలా అయితే నేను బాధపడకపోదును. మా మావగారికి సీతా, వీళ్ళ అక్కా ఇద్దరే సంతానం. వీళ్ళ పెళ్ళిళ్ళకీ, పసుపూ కుంకానికీ ఇచ్చిన అయిదేసి ఎకరాల చెరుకుతోటే కాక ఆయన తదనంతరం యాభై ఎకరాల మాగాణి, మూడు డాబా ఇళ్ళూ అన్నీ వీళ్ళవే!'

ఇక వీడి భార్య ప్రవర్తనని వ్యాఖ్యానించక అక్కడితో ఆపు చెయ్యడం మంచిదేమో ననిపించింది. నేనేదో అనేలోగా వాడే అనేశాడు. 'అందం, ఆస్తి, చదువూ...మనం చేసుకోబోయే అమ్మాయిల నుంచి ఇవే ఆశించి ఇంకేం కావాలని అనుకుంటే నాలా బోర్లాపడడం తప్పదు. అదే మిత్రా ఉన్నట్టుండి ఒక్కసారి అలా అయిపోయావ్?'

'ఏం లేదు. ఏం లేదు. ఏదో జ్ఞాపకానికి వచ్చి....' అని తప్పిం చుకో బోయాను. అందం, ఆస్తి, చదువూ — నాకు తెలిసినంతవరకు సరోజ లక్షణాలు. సాధారణంగా వధూవరులు ఒకర్ని గురించి ఒకరు తెలుసుకొనేవీ, మన సంఘ మర్యాద ననుసరించి తెలుసుకోడానికి వీలైనవీ ఇంతమాత్రమే — ఇంతకంటె లోపలదూరి చూడడం సాధ్యమా? ఔదా ర్యమూ, మానవత్వమూ అనేవి ఉన్నాయోలేవో అని సరోజ గురించి నేనే కాదు, నా గురించి సరోజా అనుమానించవచ్చు మరి! 'సరే—నీ మనసు లోని దేమిటో సమయం వచ్చినప్పుడే చెబుదువుగాని....పోనీ ఇదైనా చెబు తావా? ఇందాక ఆఫీసుపనిమీద రావడం అబద్ధమన్నావే....' అడగనే అడిగేశాడు.

"అలాగే చెబుతాలే...తలనొప్పిగా ఉంది..... వో గడీ ఆగు...."

సమయానికి మాటమార్చి, మరో పావుగంటపోయాక నెమ్మదిగా చెప్పేను.... ఇలా వో అమ్మాయి నాకు స్థిరమైందనీ, ఓసారి కలుసు కుందామని వచ్చాననీ.... వాడు పక పక నవ్వుతూ అన్నాడు.

'ఓరి భలేవాడివే! మీవాళ్ళ ఇల్లు ఎక్కడా, నరసింగరావుపేటలో కదూ! అదెక్కడో దూరంగాలేదురా.... మా పెరటి తలుపు ఎదురింటికి నాలుగో ఇల్లే. ఇదివరకు వచ్చానన్నావు, భలేగా జ్ఞాపకం ఉంచుకున్నావే ఊరిని! ఇంతమంచి కబురు కడుపులో దాచుకుని ఇంత ఆలశ్యంగా బయట పెడతావ్, నిన్నేంచేస్తే పాపం ఉందీ? పదపద... క్వాలిటీ ఐస్ క్రీమ్‌లో ఏదో అయిదురూపాయల రకం వచ్చిందిట, అది ఇప్పిస్తేగాని నా కోపం చల్లారదు...' సహృదయుడైన మిత్రుడి సరస సల్లాపాల చిరుగాలులు నా మనోగగనంలోకి కమ్ముకువస్తున్న అనుమాన మేఘాల్ని చిందరవందర చేసేశాయి. ఇంటికి వెళ్ళి వెళ్ళగానే వాళ్ళ తమ్ముణ్ని పరిగెత్తించి వాకబుచేయించాడు. నాకు అందిన భోగట్టా కరెక్టే. రాజమ్మా, సరోజా రెండురోజుల క్రిందటే అనకాపల్లి వచ్చేరుట. ఆ రోజు పొద్దుట భోజనాలు అయాక రిక్షా మీద వాళ్ళ పొలాలున్న గ్రామానికి, అక్కడికి అయిదు మైళ్ళు వెళ్ళేరుట. ఆ రాత్రి కరణంగారింట్లో ఉండిపోయి, అన్ని పనులు పూర్తి అయిపోతే మర్నాడు మధ్యాహ్నానికి అనకాపల్లి చేరుకుంటారుట. అదృష్టవశాత్తూ ఆ మర్నాడు పున్నమి. ఆ రాత్రికేనా సరోజ ఇల్లు చేరుకోదా? ఆ చల్లని నిండు పున్నమివేళ ఆ సంపూర్ణ సౌందర్యరాశితో మనస్సు విప్పి మధుర మధురంగా మాట్లాడు కోడానికి ఒక్క పది నిమిషాలు ఈ జన్మకి చాలవా!

శనివారం సాయంకాలం వాళ్ళు తిరిగొచ్చారని తెలిసిందగ్గర్నుంచీ నా ఆరాటానికి అంతు లేకపోయింది.

"ఇంకా ఆలోచిస్తావేం, ట్రిమ్‌గా ముస్తాబై వెంటనే బయల్దేరక?" అన్నాడు సుధాకరం.

"అలాగే....ఇంకా ఇప్పుడేగా వచ్చారని తెలిసింది! అయిదు మైళ్ళు ఆ నాటురోడ్డుని ఆడకూతుళ్లు వెళ్ళొచ్చారంటే అది సామాన్యమయిన

విషయం కాదు. కొంచెం విశ్రాంతి తీసుకోనీ — చల్లబడ్డాక, దీపాలు పెట్టేక, ఏ ఎనిమిదిన్నరకో బయల్దేరదాంలే. ఇక్కడేగదా!„

"బయల్దేరదాం!? నేనుకూడా రావాలా ఏం కొంపతీసి!?"

"పోనీ రారా ఏం పోయింది. మా సరోజని నీకు పరిచయం చేస్తాను."

"బలేవాడివిరా! ఇంత ధైర్యం, చొరవా గల మగమహారాజువి అక్కణ్ణుంచి ఏమంటూ వచ్చావురా నా తండ్రీ !" అంటూ వెక్కిరించాడు వాడు.నిజానికి వీళ్ళందరూ....అంటే సుధాకరం, వీళ్ళ అమ్మా,తమ్ముడూ, చెల్లెలూ — అటువైపు రాజమ్మా, వాళ్ళ మొగసాయంకోసం కరణం గారింటినుంచి వెంటబెట్టుకు వచ్చిన పాలికాపు లచ్చన్నా—వీళ్ళందరూ ఉండబట్టే నాకు లేనిపోని సిగ్గూ, మొహమాటం కలుగుతున్నాయి— అనిపించింది. నేనూ, సరోజా మేమిద్దరమే ఉంటే!

తీరా మేము బయల్దేరి ఆ రాత్రివేళ ఆ ఇంటికి వెళ్లేసరికి నాకు ఎదురయిన సంఘటన నేను కలలో కూడా ఊహించి ఎరుగనిది!

మేడమీది గదిలో సరోజా, రాజమ్మా పడుకున్నట్టున్నారు. పాత సీలింగ్ ఫేన్ మంచి కండిషన్‌లో లేనట్టుంది—పెద్ద చప్పుడు కిందకి వినబడుతోంది. వీధిగదిలో (ఎవరో) కుర్చీలో కూర్చుని ఉన్నట్టు కని పించింది — కిటికీలో మసిబారిపోయిన చిన్న లాంతరు వెలుగులో.

"ఎవరదీ, ఇలా రండి బాబూ!" అని ఆయన కేకేశాడు.

మేం ఇద్దరం అటువైపు వెళ్లేం—ఆయాసపడుతూ, ఆయన అడిగాడు.

'నువ్వు రవణమ్మ రెండోకొడుకువి కదూ! చిట్టి పెళ్ళికి వచ్చావు కదూ మీ అమ్మతో, అప్పుడు చూశాను నిన్ను — నా పేరు సుబ్బరామయ్య. నే నెవరో వాలాచెబితే నీకు బోధపడుతుంది. సరోజకి స్వయంగా పెద్ద మేనమావని నేను. అన్నట్లు నీకూ సరోజకీ నిశ్చయమయిందటగా చెల్లెమ్మ రాసింది. బాగుంది నాయనా! ఏం పనిమీద వచ్చావు ఇటు వైపు ?"

"ఆఫీసు ఇనస్పెక్షన్ పనిమీద వచ్చానండి—ఇదిగో ఇతను నా

స్నేహితుడు సుధాకరమని ఇక్కడే కాలేజీలో పనిచేస్తున్నాడు—వీళ్ళింట్లో దిగేను—ఇలా మనవాళ్ళు వచ్చారని తెలిసి..."

'బాగుందిబాబూ—ముహూర్తాలు పెట్టుకున్నారా?'

ఇంకా లేదన్నట్టు నేను తల ఊపుతుండగా సుధాకరం అడిగాడు.

'అదేమిటండీ ఫేను తిరుగుతున్నట్టు పైన అంత చప్పుడవుతోంది మరి ఈ గదిలో కరెంటులేదా?'

'అన్నట్టు ఈ ఇల్లు మీదేకదూ బాబాయ్?' అని నేనూ మాట కలిపేను.

'చెప్పాలంటే ఈ ఇంటి బేరంకోసమే నే వచ్చింది. ఇల్లు ఇంత అధ్వాన్న పరిస్థితిలో ఉందని నాకు తెలీదు. ఒక్క వంటగదిలోనూ పైన మేడమీద గదిలోనూ తప్ప వైరింగ్ అంతా చెడిపోయి ఉంది. ఏదైనా దగ్గరుండి చూసుకోకపోతే ఇంతే అనుకోండి—తమ్ముళ్ళెవరికి అసలు పట్టదు. ఇల్లు అమ్మి సొమ్ము పంపితే అందుకోడానికి మాత్రం సిద్ధం....ఆఖరికి ఇంత జబ్బుమనిషినీ ఆ కాన్పూరునుంచి, రెండు రైళ్ళు మారి—అమ్మ—అయ్యో—' దగ్గూ, గుర గురా ఆయన్ని ఉండనివ్వ లేదు. ఈ జబ్బు, దీని వ్యవహారం నాకు పూర్తిగా తెలుసు. ఈ ఆస్తమా తోనే మా అమ్మ తీసుకుని, తీసుకుని ప్రాణాలు విడిచింది. లాంతరు వత్తి పెద్దది చేసి సుబ్బరామయ్యగారి దగ్గిరపెట్టి చూస్తే గుండె జల్లుమంది. మొండిమనిషి, ఇంతసేపూ ఎలా మాట్లాడగలిగేడో! గుండెలు ఎలా ఎగిరెగిరి పడుతున్నాయో!

"ఎటాక్ బాగా ఉధృతంగా వచ్చినట్టుంది. వెంటనే ఇంజక్షన్ పడితేగాని సర్దుకోదు — సుధాకరం, నీకు తెలిసిన డాక్టరెవరయినా దగ్గిర్లో—"

వాడు బయల్దేరబోతుంటే ఆయన వారించారు. పక్కనున్న లెదర్ బేగ్ చూపించి అందులో మాత్ర ఉందని, అదీ మంచినీళ్ళు ఇమ్మని సంజ్ఞ చేశారు. నే నలాగే చేశాను. మాత్ర వేసుకున్న పదిపది హేను నిమిషాలకు బాగా తగ్గినట్టు అనిపించింది.

'వీళ్ళిలా వస్తున్నారని చెల్లెమ్మ టెలిగ్రాము ఇచ్చింది. అందుకే ఏమైతే అయిందని బయలుదేరేను. ఈ దిక్కుమాలిన రోగానికి హోటలు భోజనం పడదుగా! రైల్లోనే ఆరంభించింది. దిగేసరికి ఎలా ఉండాలో అలా ఉంది. తీరా నేను వచ్చేసరికి వీళ్ళు లేరు. వాళ్లా వచ్చి వంట మొదలు పెట్టి అన్నీ చేసేసరికి నేను తినే స్థితిలో లేను. ఇంత చికాగా ఉన్నప్పుడు అన్నం తింటే ఇంకేమైనా ఉందా! వద్దన్నాను....'

'ఇంకా ఇప్పుడేం చూశారు? డాక్టరొచ్చి ఇంజక్షనిచ్చి వెళ్ళేడు గాబట్టి గాని.'

'ఇంజక్షను పుచ్చుకున్నారూ అప్పుడే? పుచ్చుకున్నాకే ఇంత బాగుందా?'

'ఏమనుకున్నారు మరి? నిలయ విద్వాంసులు అంత సులువుగా వదుల్తారా? అంటూ అతను నవ్వేడు. నవ్వుతో మళ్ళీ ఆయాసమొచ్చింది ఈసారిజంత్ర సమ్మేళనం మరింత స్పష్టంగా వినిపించింది.

మరో మాత్ర వేసుకున్నాక కొంచెం తగ్గింది.

'వాళ్ళప్పుడే పడుకున్నారో ఏమో! వెళ్ళి చూసిరండి...ఇంతకీ నువ్విలా వస్తున్నట్లు సరోజకి తెలిసినట్టు లేదే!'

'అవునండీ . తీరా బయల్దేరేదాకా నాకే తెలీదూ....మీకిలా ఉన్న ప్పుడు ఈ రాత్రివేళ పైకి వెళ్ళి పలకరించకపోతే యేం లెండి. రేపొ ద్దున్న వస్తాంగా...'

'అయ్యో నా కోసం ఎంతకని కనిపెట్టుకుంటారు, మీ పనుల్ని మానుకుని? ఇది నాకైతే మామూలేగాని నాకు చేసేవాళ్ళకి మాత్రం అవస్థే...అమ్మో...బాబోయ్...మంట .... ఈ దిక్కుమాలిన మాత్రలు చాలా పవర్‌ఫుల్‌వి. బాధ భరించలేక రెండు మింగేశాను పొరపాటు పని చేశాను....లోపల దహించేస్తోంది....ఎలాగ, ఏందారి? భగవంతుడా...'

పాపం ఆయన బాధ చూడలేకపోయాను. డాక్టరుకోసం మళ్లీ పరి గెత్తబోతే మళ్ళీ వారించాడు.

'చూడుబాబూ ... కొంచెం మేడమీదకి కబురంపించు .... మెట్టు మీద పడుకుని ఉంటాడు లచ్చన్న....వాణ్ణి కేకేస్తే రాజమ్మని లేపుకొ స్తాడు. ఇంత అన్నం ఉందేమో, కొంచెం మజ్జిగపోసి మెత్తగా కలిపి తెచ్చి

పెట్టమను. అది తాగితే కడుపులో మంట కొంచెం చల్లారుతుందేమో....'
సుధాకరాన్ని సుబ్బరామయ్యగారికి సాయంగా ఉంచి బ్యాటరీలైటు సాయంతో లోపలికి వెళ్ళేను. మేడమెట్లుపై పెద్దమెట్టుమీద పడుకున్న అచ్చన్నని లేపేను. తలదగ్గిరున్న చేపాటి కర్రను చటుక్కున అందుకుని లేచి కూచున్నాడు వాడు. సుబ్బరామయ్యగారి చుట్టంగా నన్నువాడికి పరిచయం చేసుకున్నాను. సంగతి చెప్పి రాజమ్మని లేపి తీసుకురమ్మన్నాను.....వాడు పడుకున్న చోటినుంచి మేడమీద గదికి దారితీసే వరండా కాస్త పెద్దది. వాడు వెళ్ళిన రెండునిమిషాలయినా ఇంకా రాలేదేమీ అని గదిదగ్గిర కెళ్ళేను. అప్పుడు నాకు వినిపించిన మాటలు నేను జన్మలో మరచిపోలేనివి.

'చుట్టమో, దెయ్యమో....నిన్ను లేపినవాడికి బుద్ధిలేకపోతే పోయింది, నువ్వేమంటూ వచ్చావు అచ్చన్నా! కరణంగారు నీతో ఏం చెప్పేరు, ఇంత డబ్బుతో ఉన్నాం గదా ఆడకూతుళ్ళం, నువ్విలా కదలి వచ్చేస్తే మాగతేంకాను? అయినా ఈ అమ్మకి మతీసుతీలేదు. పెద్ద మామయ్యకి పెళ్ళిగ్రాం ఎందుకివ్వాలి? దిక్కుమాలిన రోగం కాదుగాని మధ్యని మమ్మల్ని చంపేస్తున్నాడు బాబూ ... పడుకున్నారు ఎంత తలుపు కొట్టినా లేవలేదని చెప్పేద్దూ అచ్చన్నా'

'ఉండు అచ్చన్నా...మరోమారు ఆలోచించుకోనీ....చూడమ్మా సరోజా....వాళ్ళు ఎవ్వరైనా ఏమనుకుంటారో....పోనీ మీ అమ్మయినా ఇలా జరిగిందని తెలిస్తే ఏమంటారో అదైనా ఆలోచిద్దాం. మీ మామయ్యమీద సానుభూతితోకాదు సుమా నేను మాట్లాడుతూంట .... ఇందాక తినవయ్యా బ్రాహ్మడా అంటే మనతో తిని చావగూడదూ, ఈ అపరాత్రి వేళ మనల్ని కాల్చుకు తినకపోతే! ఆ రిక్షాలో కూచోలేక గూళ్ళు కదిలిపోయాయి. ఇప్పుడు లేచి నేనెలాగా వండి వార్చేది లేదు....ఇందాకటి పొడిమెతుకులే ఇన్ని మిగిలినట్టు జ్ఞాపకం .... ఇన్ని మజ్జిగ చుక్కలు తడిపి, పారేసి వస్తానుండు....అనవసరంగా నిందైనా తప్పుతుంది.'

'రాజమ్మా! ఏళ్ళు ముదిరినకొద్దీ నీకు బుద్ధికూడా పెడదోవ పడుతున్నట్టుందే! అక్కడికి నువ్వేమో మావయ్యకి ఆపదలో ఆదుకున్నదానివీ, నేనేమో పైదాన్నినా ... గడికి కావాలంటాడు గడికి వద్దంటాడు

మావయ్య సంగతి నువ్వేమెరుగుదువు? అందులో ఆ వంటగది తాళం ఏ ఇక్ష్వాకుల నాటిదో వో పట్టాన వచ్చిచావదు. నువ్వెళ్ళి కింద కూచుంటావు. నేనేమో ఇన్నివేలతో బిక్కుబిక్కుమంటూ ఒక్కర్తెనీ ఇక్కడ అఘోరి స్తాను. చాల్లేవమ్మా, చెప్పేవ్? లచ్చన్నా ఏం చెప్పేను నీకు? ఎంత పిలిచినా పలకలేదని చెప్పేయ్ .... వెళ్ళు'

లచ్చన్నకంటె నేనే ముందుగా పెద్దమెట్టు దగ్గిరచేరి, రాగానే వాడి కబురు అందుకున్నాను. 'ఫేను చప్పుడులో కాబోలు ఎంత పిలిచినా వాళ్ళు లేవలేదు బాబాయ్!' అని చెప్పేను. సుధాకరం పరుగుపరుగున ఇంటికి వెళ్ళి వాళ్ళమ్మని లేపి పావుగంట దాటకుండా పెద్దగిన్నెడు మజ్జిగన్నంతో సిద్ధమయ్యాడు.

ముందురోజు రాత్రి సరోజను కలుసుకోలేదనే తహతహతో నిద్ర పట్టలేదు. ఆ రోజురాత్రి సరోజను తెలుసుకున్నాననే బాధతో నిద్రపట్ట లేదు. నిద్రపట్టడం ఎందుకు? ఇప్పటికైనా మేలుకోగలిగానని తృప్తిపడక బాధ చేనికి, సంతోషించక! ఆరోజు సుధాకరం ఎంత బతిమాలినా గుప్పెడన్నం తినలేక పోయాను. రాత్రివేళ ఆకలితో బాధతో నిద్రపట్టక లేచి కూచుని మంచినీళ్ళు తాగుతుంటే మళ్ళీ అమ్మ జ్ఞాపకం వచ్చింది. అమ్మకి సంబంధించిన మధురమైన సంఘటన ఒకటి గుర్తుకొచ్చింది.

ఒకసారి మా యింట్లో పాలుపితికే అప్పలస్వామి, పెళ్ళాం పురుడు అయితే పాతబియ్యం కావాలని అమ్మని అడగడానికి వచ్చాడు. కూడా పెద్దకొడుకు నూకయ్యగాణ్ణి, అప్పటికి ఎనిమిదేళ్ళవాడు, వాణ్ణి తీసు కొచ్చేడు. అమ్మ అప్పలస్వామి పైచెంగులో బియ్యంపోసి 'వీడెవడ్రా మెరు స్తున్న కళ్ళు వీడూను?' అంటూ వాడి గుండు మీద ఒకటి వాయించి మిఠాయి ఉండ ఒకటి చేతిలో పెట్టింది. అమ్మ హృదయంలాగే ఆ మిఠాయి ఉండ చాలా పెద్దది. రెండు చేతుల్తోనూ కష్టపడి మోసుకెళ్లేడు నూకయ్యగాడు. ఆ తరవాత నూకయ్య చాలాసార్లు మా యింటికి వచ్చాడు. ఎప్పుడొచ్చినా 'ఇంత మిఠాయి ఉండ ఇచ్చిన అమ్మ'గారికోసం వాడి మెరుస్తున్న కళ్ళు ఆరా తీసేవి. వాడొక్కడే కాదు. లోకంలో ఉన్న వాళ్ళంతా ఆదరణా ఔదార్యమూ అనేవి ఎక్కడ దొరుకుతాయో అని

వెతుకుతూ ఉంటారు. మనిషిగా అలాంటి వాటికోసం వెతకడం సహజ ధర్మం. అలాగే అలాంటివి దొరకని చోటునుంచి తప్పుకోడం కూడా అవ సరం. సుధాకరం వాళ్ళు వాళ్ళలా సరోజ నావాళ్ళెవరికీ చెయ్యవలసిన అవ సరం లేకపోవచ్చు. కాని సహృదయం లోపించిన సరోజతో నేనే క్షణం గడపలేకపోవచ్చు. అంత అందమైనదీ చదువుకున్నదీ ఆస్తి ఉన్నదీ మరొ కర్తి దొరక్కపోవచ్చు. కాని అన్నిటినీ మించిన మానవత్వం ఉన్నది మరొకర్తి దొరకొచ్చు. లోకం గొడ్డుపోలేదు. పదునెక్కిన మనస్సుతో సేద తీరిన హృదయంతో ఆదమరచి నిద్రపోయాను.